క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ ఫీజు తగ్గించాలి



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల సెమిస్టర్ ఫీజు విపరీతంగా పెంచడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సెమిస్టర్ ఫీజు తగ్గించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. పరీక్ష కో ఆర్డినేటర్ శివ ప్రసాద్ ను కలిసి సమస్య విన్నవించారు. వీసీని కలిసిన వారిలో గుంటూరు నగర సంఘటన కార్యదర్శి సాయి, నగర కార్యదర్శి ఈశ్వరలాల్, సంయుక్త కార్యదర్శి నాగ సాయి, వంశీ, శ్రీను, జాస్మిన్, హరిణి, నిఖిత, బాలాజీ, సాత్విక్ పాల్గొన్నారు.

కిట్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ (కిట్స్) ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హెచ్‌సీఎల్-టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. కళాశాలకు చెందిన 676 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు పేర్లు నమోదు చేసుకోగా, వారిలో 276 మంది మౌఖిక పరీక్షకు అర్హత సాధించినట్లు కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ విన్సీ జోసెఫ్ తెలిపారు. విన్సీ జోసెఫ్ మాట్లాడుతూ క్యాంపస్ డ్రైవ్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు తమ కంపెనీలో అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చి, వసతులు, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, ఉపాధి కల్పనాధికారి చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్సిటీలపై అవినీతి ఆరోపణలు ఆందోళనకరం

ఏఎన్‌యూ: డీమ్డ్ వర్సిటీపై అవినీతి ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లవరపు పవన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యా సంస్థలోని ఉన్నత స్థాయి ఉద్యోగులు, న్యాక్ బృందంలోని సభ్యులు అవినీతికి పాల్పడం విచారకరమని చెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కష్టపడి చదివితే బంగారు భవిత



కాకుమాను: కష్టపడి చదివితే బంగారు భవిత సిద్ధిస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ బాబు అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం ఆయన విద్యాభివృద్ధికి రూ.ఐదున్నర లక్షల నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య వజ్రాయుధమని, అందరూ ఇష్టంగా చదవాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

పౌష్టికాహారానికి రూ.లక్ష అందజేత

పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు సాయంత్రం సమయంలో పౌష్టికాహారం అందించడం కోసం ఈ ఏడాదికి మరో లక్ష రూపాయలను ప్రసాద్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జవహర్‌రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రైతులకు శిక్షణ తరగతులు



గుంటూరు రూరల్: భారత ప్రభుత్వ రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీకి చెందిన హిల్ లిమిటెడ్ మార్గదర్శకాలతో వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో పురుగు మందుల వినియోగం, భద్రత చర్యలపై రైతులకు ఈనెల 5న శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. శిక్షణకు రైతులందరూ ఆహ్వానితులేనని చెప్పారు. రైతులకు సేఫ్టీ కిట్ ఇస్తామని వెల్లడించారు. మధ్యాహ్న భోజనం వసతి ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం లంచ్ వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 97053 83666, 99859 95050 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాకులం

ధ్రువీకరణ పత్రాల కోసం అవస్థలు

- ప్రత్తిపాడు మండలంలో దుస్థితి
- దరఖాస్తు చేసిన రెండు నెలలకూ దిక్కూమొక్కూ లేని వైనం
- అడిగిన సర్టిఫికెట్లన్నీ జతచేసినా పదేపదే తిరస్కరణలు
- ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు



ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థినికి టీసీ, టెన్త్ మార్క్స్ మెమో లేదన్న కారణంతో దరఖాస్తు తిరస్కరించిన కుల ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్ స్టేటస్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలో విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాలు పొందడం అతి కష్టంగా మారుతోంది. దరఖాస్తు చేసిన నాటి నుంచి 30 రోజుల్లో కుల ధ్రువీకరణను మంజూరు చేయాల్సి ఉన్నా.. రకరకాల కారణాలను చూపుతూ దరఖాస్తులను తిరస్కరిస్తూ, అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ఏం చేయాలో, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

టీసీ లేదన్న కారణంతో..

యనమదలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఇద్దరు కుమార్తెలు. ఆయన తన ఇద్దరు కుమార్తెల కులధ్రువీకరణ కోసం తన క్యాస్ట్ సర్టిఫికెట్ జతచేసి గ్రామ సచివాలయంలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్‌కు నవంబరులో దరఖాస్తు చేశాడు. తన కుమార్తెలకు బాప్టిజమ్ సర్టిఫికెట్ లేదన్న కారణాన్ని చూపుతూ మొదటిసారి అధికారులు దరఖాస్తును తిరస్కరించారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగకపోవడంతో ఏమిచేయాలో పాలుపోక కుమార్తెల బాప్టిజమ్ సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్లు తీసుకుని రెండోసారి కూడా డిసెంబరులో సచివాలయంలో దరఖాస్తు చేశాడు. మళ్లీ తిరస్కరించారు. ఈ సారి రిజెక్ట్‌కు కారణాలు టీసీ లేకపోవడంతో పాటు ఒక దరఖాస్తుదారునికి రెండు సర్టిఫికెట్లు ఇవ్వరట. వాస్తవానికి తన ఇద్దరు కుమార్తెలు బెజ్జం ప్రణీత, బెజ్జం ప్రణవిల పేర్లతో వేర్వేరుగా దరఖాస్తు చేశాడు. దరఖాస్తు సమయంలో తండ్రి ఆధార్, క్యాస్ట్, టీసీ, ఇద్దరు పిల్లల ఆధార్లు, స్టడీ సర్టిఫికెట్లు, బాప్టిజమ్ సర్టిఫికెట్లు జతపరిచాడు. కానీ పైకారణాలతో సర్టిఫికెట్లు తిరస్కరణకు గురయ్యాయి. వీఆర్వో చెబుతున్న వాటిలో మరో కారణం టీసీ లేకపోవడం. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థినులు పాఠశాలల్లో చదువుతున్నారు. టీసీ అనేది పాఠశాలలో చదువు ముగించుకుని బయటకు వెళ్లే సమయంలో ఇచ్చేది. కానీ చదువుతున్న సమయంలో విద్యా సంవత్సరం మధ్యలో విద్యార్థుల టీసీలు అడగడం, అది జత చేయలేదని తిరస్కరించడం తండ్రిని విస్మయానికి గురి చేసింది. ఇలా అనేక రకాల నిబంధనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కుల ధ్రువీకరణ పత్రాల కోసం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారిపోతున్నారు.

అయితే ఈ విషయమై ఆ గ్రామ వీఆర్వో సురేష్‌ను 'సాక్షి' ప్రశ్నించగా నేను, ఆర్‌ఐలు దరఖాస్తులను ఫార్వర్డ్ చేశామని చెప్పారు. అవి తహసీల్దార్ స్థాయిలోనే తిరస్కరణకు గురయ్యాయని వివరించారు. ఒక అప్లికెంట్‌కు రెండు సర్టిఫికెట్లు ఇవ్వకూడదన్న కారణం, టీసీ, బాప్టిజమ్ సర్టిఫికెట్లు లేవన్న కారణంతో రిజెక్ట్ చేసి ఉంటారని చెప్పారు.

- అదేవిధంగా ప్రత్తిపాడుకు చెందిన ఓ విద్యార్థిని ఇంటర్మీడియెట్ మొదటి ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుల ధ్రువీకరణ పత్రం కోసం తండ్రి గత ఏడాది నవంబరు 2న మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేశాడు. ఇప్పటికి దాదాపుగా 90 రోజులు అవుతున్నా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ రాలేదు. నేటికీ ఆన్‌లైన్‌లో స్టేటస్ ఫార్వర్డ్ టు ఎమ్మార్వో అని చూపిస్తుంది. ఎందుకు రాలేదో.. ఎక్కడ ఆగిందో నేటి వరకు అతనికి తెలియని పరిస్థితి.

గతంలో వేగంగా జారీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థులు కుల ధ్రువీకరణకు దరఖాస్తు చేసిన వెంటనే అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి సర్టిఫికెట్లు మంజూరు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన నాటి నుంచి విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు.

'స్పర్శ' లేని మచ్చలతో ముప్పు

- గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే
- ఫిబ్రవరి 13 వరకు వ్యాధిపై విస్తృత అవగాహన, సర్వే



అనుమానిత లక్షణాలు ఉన్న రోగిని పరీక్షిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్

ప్రత్తిపాడు: శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉన్నాయా.. కనుబొమ్మలపై ఉన్న వెంట్రుకలు ఊడిపోతున్నాయా.. మందమైన మెరిసే జిడ్డు గల చర్మం ఉందా.. అయితే మీరు వెంటనే వైద్యులను సంప్రదించాలి. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు 'స్పర్శ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఉచితంగా ఎండీటీ మందులు

కుష్ఠు వ్యాధి అనుమానిత లక్షణాలున్న వారు ఇంటి వద్దకు ఆరోగ్య కార్యకర్తలు పరీక్ష చేయడానికి వచ్చినప్పుడు వారికి సమస్యను చూపించి నిర్ధారణ చేయించుకోవాలి. వైద్యాధికారి వ్యాధి నిర్ధారణ చేసి ఎండిటి మందులు అందిస్తారు. ఇప్పటి వరకు కుష్ఠు అనుమానిత లక్షణాలున్న 20 మందిని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో, 36 మందిని ప్రత్తిపాడు కోలొకేటెడ్ పీహెచ్‌సి పరిధిలో గుర్తించారు.

వైకల్యం బారిన పడకుండా



గ్రామాల్లో మా సిబ్బంది కుష్ఠువ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజలు సిబ్బందికి సహకరించారు. శరీరంపై ఎలాంటి కుష్ఠు వ్యాధి అనుమానిత లక్షణాలున్నా సిబ్బందికి లేదా వైద్యులకు చూపించి నిర్ధారణ చేయించుకోవాలి. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

– మేరి యునిస్, వైద్యాధికారి, గొట్టిపాడు పీహెచ్‌సీ

టెన్త్ విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

చేబ్రోలు: జిల్లా పరిషత్ ఆర్థిక సహకారంతో 2025 మార్చిలో జరిగే ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం చేబ్రోలు మండలం నారాకోడూరు జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ప్రారంభించారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లోని 174 మంది టెన్త్ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండలం ఎంఈఓ రాయల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సమావేశంలో హెచ్‌ఎం ఎం ఏడుకొండలు, ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, నాగేశ్వరావు, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ప్రశంసలు పొందిన ఏఎన్‌యూ విద్యార్థులు



ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందిస్తున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రతిష్టాత్మక గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్ దీప్ ధన్ ఖడ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీల ప్రశంసలు పొందడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయం నుంచి గణతంత్ర పరేడ్ కు వెళ్లిన ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాల విద్యార్థి ఎం.శిరీష, హిందూ కళాశాల విద్యార్థి సిహెచ్ రిత్విక్ బాబులను మంగళవారం ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి.దివ్య తేజో మూర్తి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థులు వర్సిటీకి వన్నె తెచ్చేలా ప్రదర్శన చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేవీ నిరూపమ, విభాగం సీనియర్ అసిస్టెంట్ కె.కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, ఎస్. గోపి పాల్గొన్నారు.

నోటీసుబోర్డులో పోస్టర్లు తొలగింపు



ప్రత్తిపాడు సచివాలయం-2లో పోస్టర్లు తొలగించడంతో ఖాళీగా ఉన్న నోటీసు బోర్డు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో టీడీపీ గుర్తులున్న సిమెంటు బల్లలపై కప్పిన పట్టాలు

ప్రత్తిపాడు: ఎన్నికల కోడ్ అమలులో అధికారులు విఫలమవుతున్న తీరుపై సాక్షి దినపత్రికలో మంగళవారం దాగుడు మూతల దండా'కోడ్' శీర్షికన ప్రచురితమైన ఫొటో కథనానికి అధికారులు స్పందించారు. ప్రత్తిపాడు గ్రామ సచివాలయం-2 నోటీసు బోర్డులో సీఎం ఫొటోలతో ఉన్న వాల్ పోస్టర్లు, ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఎంపీడీఓ కె.శివపార్వతి ఆదేశాల మేరకు తొలగించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తెలుగుదేశం పార్టీ గుర్తులు, రంగులతో ఉన్న బల్లలపై పట్టాలు కప్పేశారు.

సాక్షి ఎఫెక్ట్

ఆరోగ్యకర జీవనశైలితో క్యాన్సర్ నివారణ



గొట్టిపాడు పీహెచ్‌సిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్

ప్రత్తిపాడు: ఆరోగ్యకర జీవనశైలితో క్యాన్సర్‌ను నివారించవచ్చని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మేరి యునిస్ మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులను సేవించడం ద్వారా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. వీలైనంత ఎక్కువ కాలం తల్లులు పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ కేసులు తగ్గుతాయని చెప్పారు.నోటిలో పుండ్లు, మచ్చలు ఉంటే వెంటనే స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. ఉన్నట్లుండి బరువు తగ్గడం క్యాన్సర్ లక్షణాల్లో ఒకటని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కె.చెల్లమ్మ, ఎంపీహెచ్ఎస్ మరియేలు, ఎస్.విజయకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై అధ్యాపకులకు శిక్షణ



శిక్షణ పొంది సర్టిఫికెట్లను అందుకున్న అధ్యాపకులతో కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు రూరల్: ఏఐసీటీఈ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) ఆధ్వర్యంలో ఆధునిక జాతీయ స్థాయిలో నిర్వహించిన శిక్షణను పొందే అవకాశం తమ కళాశాల అధ్యాపక బృందానికి లభించడం సంతోషంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఏఐసీటీఈ నిర్వహించిన ఎమర్జింగ్ కంప్యూటర్ సైన్స్ కోర్స్‌లలో శిక్షణ పొంది ఉత్తీర్ణులై పీజీ సర్టిఫికెట్లు పొందిన 13 మంది అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. కోర్ ఇంజినీరింగ్‌లోని మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ తదితర విభాగాలలోని అధ్యాపక బృందానికి ఏఐసీటీఈ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అగ్రస్థానాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీల నిపుణులచే క్వాలిటీ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రాం ద్వారా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాల మీద పీజీ సర్టిఫికెట్ కోర్స్ నిర్వహించి ఆరు నెలల శిక్షణను అందించారన్నారు. ఈ కోర్సుకు ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయగా అందులో తమ కళాశాల నుంచి 13 మంది అధ్యాపక బృందానికి అవకాశం లభించిందన్నారు. వీరు శిక్షణను పూర్తి చేసుకుని, ఢిల్లీలో నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ టీజీ సీతారాం చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను అందుకున్నారన్నారు. వీరిని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్ అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫర్ మై భారత్ శిబిరంలో పాల్గొన్న వీవీఐటీ విద్యార్థులు



పెదకాకాని: నేషనల్ స్వయం సేవక్ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో అస్సాం అగ్రి కల్చరల్ యూనివర్సిటీలో జనవరి 21 నుంచి 27 వరకూ నిర్వహించిన జాతి సమగ్రతా శిబిరం యూత్ ఫర్ మై భారత్‌కు వీవీఐటీ విద్యార్థులు బి.వి.అజయ్ కుమార్, సీహెచ్ జీవన హాజరయ్యారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరు వీవీఐటీలో మంగళవారం కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ శిబిరానికి దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలనుంచి 200 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎంపిక కాగా, వీవీఐటీ నుంచి ఇద్దరు ఎంపిక కావడం విశేషమని ప్రశంసించారు. అనంతరం అజయ్ కుమార్, జీవనలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి అకడమిక్ డీన్ డాక్టర్ కె గిరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐఎల్‌కె భక్తసింగ్ అభినందించారు.

విద్యార్థుల ప్రగతి ఆధారంగా బోధన

లక్ష్మీపురం(కాకుమాను): విద్యార్థుల ప్రగతి ఆధారంగా బోధన చేపట్టాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ చెప్పారు. తెలగాయపాలెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. కెనడీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని బట్టి బోధించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ మౌలాలి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

గుంటూరు రూరల్: నగర శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ నల్లపాడు శ్రీనివాసకాలనీ, నల్లపాడు చెరువు, ఏటుకూరు రోడ్ కంపోస్ట్ యార్డ్, బ్రాడీపేట మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ తొలుత శ్రీనివాసకాలనీలోని ప్రజలతో కలిసి పర్యటించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏటుకురూ రోడ్డులోని జీఎంసీ కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించారు. తొలుత బ్రాడీపేట మస్టర్ పాయింట్‌ని తనిఖీ చేశారు. కమిషనర్ వెంట ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం తదితరులు ఉన్నారు.

ఫార్మా అనాకాన్-2025 ప్రారంభం



గుంటూరు రూరల్: బహుళ జాతీయ పరిశ్రమలలో ఉపాధి లక్ష్యంగా ఫార్మా అనాకాన్ 2025 కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంలోని కళాశాలలో ఫార్మా ఎనలిటికా-ఎనలిటికల్ కాన్ఫరెన్సులో భాగంగా అనాకాన్ 2025 కార్యక్రమంలో బియాండ్ ద బీకర్ గ్రీన్ టూల్స్ ఫర్ ద మోడరన్ ఎనలిస్ట్ అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ జీవస్ సైంటిఫిక్ టెక్నాలజీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె సోమేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాలలోకి ఫార్మసీ విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ ఈ రెండు రోజుల అనకాన్-2025 జాతీయ సదస్సులో గెస్ట్ లెక్చర్స్ తోపాటు -పోస్టర్ చాలెంజ్, ఫోటోగ్రఫీ కాంటెస్ట్, ఇన్స్ట్రుమెంట్ ఐక్యూ, టెస్ట్ గ్రీన్ అనలైటికల్ క్విజ్, ఎస్సే రైటింగ్ వంటి పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో బహుమతుల ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. సదస్సులో జిల్లా వ్యాప్తంగా 8 కళాశాలల నుంచి 209 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు. అనంతరం అతిథులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు సన్మానించారు.

తహసీల్దార్‌పై టీడీపీ నాయకుడి దుర్భాషలు

కాకుమాను: రోజురోజుకు టీడీపీ నాయకుల ఆగడాలు, అరాచకాలకు అడ్డూ అదుపూలేకుండా పోతోంది. తహసీల్దార్‌తో ఓ టీడీపీ నేత వాగ్వాదానికి దిగి దుర్భాషలాడిన ఘటన పెదనందిపాడులో సోమవారం జరిగింది. తహసీల్దార్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చే క్రమంలో కార్యాలయం ఎదుట నాగులపాడుకు చెందిన పాటిబండ్ల రాంబాబు తన వాహనాన్ని(కారు)అడ్డంగా పెట్టాడు. ఎంత సేపటికి కారును పక్కకు తీయకపోవడంతో గత్యంతరం లేక తహసీల్దార్ శంకరబాబు పది నిమిషాలపాటు తన కారులోనే వేచి ఉండాల్సి వచ్చింది. ఎప్పటికో తాపీగా వచ్చిన రాంబాబును గుర్తించి కారు పక్కన పెట్టుకోవచ్చు కదా అని తహసీల్దార్ ప్రశ్నించారు. దీంతో ఒక తహసీల్దార్ అని కూడా చూడకుండా ''నా ఇష్టం వచ్చిన ప్రదేశంలో వాహనం పెడతాను కావాలంటే వేరే మార్గంలో వెళ్లు'' అంటూ దుర్భాషలాడుతూ దురుసుగా సమాధానం ఇచ్చాడు. దీంతో తహసీల్దార్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ పవన్ మధును వివరణ కోరగా ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమే కానీ, ఇంకా కేసు నమోదు చేయలేదని విచారణ చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

డ్రెయిన్లలో పూడికతీత



పొన్నూరు: పట్టణంలో ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులను అధికారులు చేపట్టారు. 'డ్రెయిన్' డెడ్ శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులు డ్రెయిన్లలో పేరుకున్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

సాక్షి ఎఫెక్ట్